AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-15 | December 2023 Special Issue | ISSN: 2583-4797
**Article Link:** https://www.auchithyam.com/2023/dec_2023_spl/full_papers/december23_spl_33.php

# "కమనీయం తెలుగు రామాయణం"

### జాతీయసదస్సు నవంబర్-2023 ప్రత్యేకసంచిక

**(ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) సిద్ధిపేట, సిద్ధిపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రం.)**

## 33. శ్రీకార పద్యాలలో రామాయణం

**డా. గోలి శ్రీలత**

తెలుగు సహాయయాచార్యులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లక్షెట్టిపేట,
మంచిర్యాల, తెలంగాణ.
సెల్: +91 9293802345. Email: siripochampally@gmail.com

**వ్యాససంగ్రహం:**

*తెలుగులో కావ్యరచన ప్రారంభమైన నన్నయ కాలం నుండి ఆధునిక యుగం వరకు సంప్రదాయ సాహిత్య రచన చేసిన కవులందరూ అవతారిక సంప్రదాయాన్ని పాటించారు. ఇందులో కవిజీవిత విశేషాలతో పాటు, అంకితం, ఇష్టదేవత స్తుతి, సుకవిస్తుతి మొదలైన విషయాలు పొందుపరచడం సంప్రదాయంగా కనిపిస్తుంది. తెలుగు కావ్యావతారికలు అంశంపై జి.నాగయ్యగారు, అవతారికల్లో ఇష్టదేవతాస్తుతి విశేషాలపై జి.రాములు గారు విలువైన పరిశోధనలు చేసారు. మంగళకరమైన శ్రీకారంతో ప్రారంభమయ్యే తెలుగు కావ్యాది పద్యాలలో కవులు తమ ఇష్టదేవతాస్తుతిలో భాగంగా సీతారాములను వేనోళ్ళా కీర్తించారు అటువంటి శ్రీకారపద్యాల అధ్యయనం ద్వారా రామాయణంకు సంబంధించిన అంశాలైన సీతారాముల ఆదర్శ జీవితాన్ని, దాంపత్యాన్ని , రూప వర్ణనను, కళ్యాణఘట్ట వర్ణలను, రచనా చమత్కారాన్ని విశ్లేషించడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.*

**Keywords:** శ్రీకారపద్యాలు, అవతారిక, రామాయణం, సీతారాములు, ఆదర్శజీవితం, ఆదర్శదాంపత్యం, ఉదాత్తశృంగారం, మంగళకరం, శుభకరం, ప్రార్థనపద్యం, దేవతాస్తుతి, సంకల్పం, గుణగణాలు, కృతికర్త, కృతి భర్త, ధర్మమార్గం.

## 1. ఉపోద్ఘాతం:

తెలుగు సాహిత్యంలో కవులు తమ రచనలను ప్రారంభించేటప్పుడు వారి రచనా సంకల్పానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా మొదటగా తమ ఇష్ట దైవాన్ని స్తుతించి కావ్యారంభం కావించేవారు. ఇప్పటికీ కూడా మనం ఏ పని ప్రారంభించిన ముందు మన ఇష్టదైవాన్ని తలుచుకొని ప్రారంభించడం కనిపిస్తుంది. ఇది తెలుగునాట

తరతరాలుగావస్తున్న సంప్రదాయం. కవుల రచనాల్లో కావ్యాది శ్రీకార పద్యాల్లో ఇలాంటి సంప్రదాయనుగుణమైన ఇష్టదేవతాస్తుతితో పాటు చక్కని చమత్కారము కనిపిస్తుంది. తెలుగువారికి ఆరాధ్యదైవంగా పేరొందిన రామునికి సంబంధించిన ఎన్నో విషయాలు తెలుగు కావ్యాది శ్రీకారపద్యాల్లో కనిపిస్తాయి.

కవి కావ్యారంభంలో ఇష్టదేవతాస్తుతి చేసి ఆ కావ్య రచనకు ప్రేరేపించిన అంశాలను పేర్కొంటూ కృతికర్త కృతిభర్త వంశవర్ణనలు యొక్క వంశవర్ణనలు, సుకవిస్తుతి, కుకవినింద మొదలైనవి పేర్కొంటాడు. ఈ అంశాలన్నిటిని పేర్కొనే అవతారిక సంప్రదాయం నన్నయ నుండి నేటి వరకు కవులు తప్పకుండా పాటించినట్టు తెలుస్తుంది. జి. నాగయ్య అవతారికల గురించి తెలుపుతూ "**అవతారిక సాంప్రదాయము ప్రాచీన సంస్కృత కావ్యము లందు మృగ్యము. సంస్కృతకావ్యములు అత్యధికముగా వస్తు నిర్దేశ పూర్వకమగు మంగళ శ్లోకముతోనే ప్రారంభించబడినవి. కాళిదాసు రఘువంశము వంటి కొన్ని కావ్యము లందు మాత్రము ప్రారంభమున దేవతా స్మరణ పూర్వకమగు మంగళశ్లోకము రచించబడినది**" (బి.రాములు, తెలుగు కవుల ఇష్టదేవతాస్తుతి విశేషాలు, పుట.సం.20) అని అన్నాడు.

తెలుగు కవులందరూ అవతారికలోని మొదటి పద్యం శ్రీకారంతోనే ప్రారంభించి ఇష్టదేవతాస్తుతి చేసారు. విష్ణువు దశావతారములలో ఏడవ అవతారంగా చెప్పబడే శ్రీరాముడు ప్రజలందరికీ ఆదర్శ నడవడి చూపిన దైవం. భగవంతుడే స్వయంగా మానవుడిగా ఈ నేలపై రాముని రూపంలో సంచరించాడని ప్రజలు నమ్మకం. అందుకే శ్రీరాముని దేవునిగా ఆరాధించారు. రాముని మీద అచంచలమైన భక్తితో కవులు శ్రీకార పద్యాలలో సీతారాముల దాంపత్యం, హనుమంతుని రామభక్తి వంటి విశేషాలను పొందుపరచి స్తుతించారు.

## 2. శ్రీకారం – శుభకరం :

'శ్రీ' అనే శబ్దానికి లక్ష్మీ, సంపద, ఐశ్వర్యము, త్రివర్గము, వృద్ధి, శోభ, అలంకారము, కీర్తి, బుద్ధి, సరస్వతి, విషము, ఉపకరణము, మారేడు అనే అర్థాలని బహుజనపల్లి సీతారామాచార్యులు "శబ్దరత్నాకరం" (బహుజనపల్లి సీతారామాచారులు, శబ్దరత్నాకరం, పు.సం.760)లో పేర్కొన్నారు. వీటితో పాటుగా 'కాంతి' అనే అర్థాన్ని జి.ఎన్. రెడ్డి "'తెలుగు నిఘంటువు తెలుగు - తెలుగు"లో చేర్చారు. (జి.ఎన్. రెడ్డి, తెలుగు నిఘంటువు, పు.సం.764) "ఆంధ్ర- తమిళ- కన్నడ త్రిభాషానిఘంటువు"లో పైన పేర్కొన్న అర్థాలే కాకుండా శ్రీయుతులు, గౌరవాచకము అనే అర్థాలను మరియు "పారమార్థిక పదకోశం" (2010)లో పొత్తురు వెంకటేశ్వరరావు శ్రీదేవి, మహాలక్ష్మి, బ్రహ్మవిద్య, అవిద్య, పద్మం, మోక్షసామ్రాజ్యలక్ష్మి, కీర్తి అనే అర్థాలు కూడా పేర్కొన్నాడు. తెలుగులోని ప్రాచీన కావ్యములలో ఒకటి రెండు తప్ప మిగిలినవన్నీ కూడా 'శ్రీ'కారంతో ప్రారంభమైనవే ఉన్నవి. 'శ్రీ' అనేది లక్ష్మీ వాచకం కనుక శ్రీకారం కావ్యాదిలో ప్రయోగించుటవలన సర్వశుభములు కలుగుననే నమ్మకంతోనే అందరూ శ్రీకారంతో కావ్యాన్ని ప్రారంభించిరి. రాను రాను ఇదొక సాంప్రదాయంగా కొనసాగింది. "**తెలుగులో నన్నయ నుండి 19వ శతాబ్దం చివరి వరకు కవులందరూ' శ్రీ'కారముతో కావ్యము నారంభించే సంప్రదాయాన్ని నియతంగా**

**పాటించారు. అచ్చ తెనుగు కావ్యములైన తెలగన 'యయాతి చరిత్ర', కూచిమంచి తిమ్మకవి 'అచ్చ తెనుగు రామాయణము' మొదలైన కావ్యములలో 'శ్రీ' కి వికృతి అయినా 'సిరి'తో ఆరంభమైనవి. కొందరు కవులు కావ్యాది పద్యమే కాకుండా రెండవ, మూడవ పద్యాలు సైతం శ్రీకారంతోనే చెప్పినారు. మడికి సింగన 'వాశిష్ఠ రామాయణము' నందు మొదటి శ్లోకం ఆ తరువాత రెండు శ్రీకార పద్యములు కలవు. చేమకూర వెంకట కవి 'విజయ విలాసము' నందు మరింగంటి సింగరాచార్య 'దశరథ రాజ నందన చరిత్ర' యందు వరుసగా మూడు శ్రీకార పద్యములు కలవు**". (బి. రాములు, తెలుగు కవుల ఇష్ట దేవతా స్తుతి విశేషాలు, పుట.సం.25) ఇలాంటి శ్రీకారంతో ప్రారంభమయ్యే కావ్యాది పద్యాలలో శ్రీరామునిపై భాక్తిభావనలు, కావ్యవస్తునిర్దేశం, రామయణానికి సంబంధించిన అనేక విశేషాలు చమత్కారంగా వర్ణించబడ్డాయి.

## 3. సీతారాముల ఆదర్శ దాంపత్యం :

**"శ్రీ లీలం దిలకంబు కస్తురిని జిత్రింపంగ నీచెక్కుట**
**ద్దలం జూచెద నీడ నానఁ గఁ వదుద్యుత్కాంతికర్పూర రే**
**ఖాలక్ష్మిం గన మిక యంచు మఱి దక్కం జూడు నాఁ జూచి వీ**
**క్షాళి నల్విగ మెచ్చుసీత నగురామాధీశుఁ జింతించెదన్.**" (సమీరకుమారవిజయము, పుట.1)

పై పద్యం పుష్పగిరి తిమ్మన్న రచించిన "సమీర కుమారవిజయము"లోనిది. ఈ శ్రీకారపద్యంలో సీతారాముల యొక్క ఆత్మీయతను, ఆదర్శదాంపత్యాన్ని సహజ సిద్ధంగా, సౌందర్యబద్ధంగా వర్ణించారు. శ్రీరామునికి సీతమ్మ నుదుటిపైన కస్తూరి తిలకాన్ని దిద్దుతున్నప్పుడు శ్రీరాముని చెక్కుటద్దాలలో ఆ సీతాదేవి రూపం ప్రతిబింబించిందట. అయితే అమ్మవారు తెల్లని ముఖవర్చస్సు కలిగి ఉండటం వల్ల ఆ ప్రతిబింబించిన రూపం మిక్కిలి కాంతిని వెదజల్లుతుందట. ఆ వెదజల్లిన కాంతిని సీతాదేవి చూడలేక తన కళ్ళను పక్కకు తిప్పుకుందట. అలాంటి సీతాదేవిని చూసి శ్రీరాముడు మెచ్చుకొని నవ్వుతున్నాడు. అలాంటి శ్రీరామచంద్రునికి నమస్కరిస్తున్నాను అని అర్థం. ఇందులో సీతారాముల దాంపత్య జీవితాన్ని అత్యంత సుందరంగా,కడు ఆత్మీయంగా వర్ణించడం జరిగింది.

రఘునాథ నాయకుడు రచించిన "వాల్మీకి చరిత్రము" లోని ప్రథమశాసంలో శ్రీకార పద్యంలో రాముని స్తుతి ఈ విధంగా కలదు. రామాయణ కావ్యకర్త. సృష్టికి ఆదికవి అయిన వాల్మీకి యొక్క జీవిత చరిత్రను కావ్యంగా అందించాడు రఘునాథ నాయకుడు. "వాల్మీకి చరిత్రము" లోని శ్రీకార పద్యం ఈ క్రింది విధంగా ఉంది.

**"శ్రీ వైదేహియురోజ పూర్ణ కలశీశృంగంబులం బల్లవ**
**శ్రీవిన్యాసముఁజూపు హస్తముల చేఁ బ్రేమం బ్రకాశంబుగా**
**శ్రీవిద్యల్ నతకోటి కిచ్చు నలరాజీవాక్షుఁ డిక్ష్వాకువం**
**శావిర్భూతమహార్ఘరత్నము మదీ యాభీషముల్ సేయుత"** (వాల్మీకి చరిత్రము, పుట.1)

సాధారణంగా రామాయణంలో సీతారాముల దాంపత్యజీవితాన్ని గురించి వర్ణించిన సందర్భాలు తక్కువగానే కనిపిస్తాయి. కొన్ని సందర్భాలలో సీతారాముల దాంపత్యాన్ని వర్ణించినప్పటికీ కూడా అది ఉదాత్త

శృంగారంగానే కనిపిస్తుంది. కానీ రఘునాథుని "వాల్మీకి చరిత్ర"లో శ్రీకార పద్యంలో సీతారాముల శృంగారాన్ని ఆ కాలంనాటి భోగలాలసతకు చిహ్నంగా వర్ణించడం విశేషం. సీతమ్మ యొక్క స్తనసంపదపై తన చేతి వేళ్ళ లాఘవాన్ని ప్రేమగా ప్రదర్శింపజేసే ఆ శ్రీరామచంద్రుడు గొప్ప సంపదలన్నింటిని తన భక్తకోటికిచ్చే రాజీవాక్షుడు. రఘువంశలో జన్మించిన గొప్ప రత్నం లాంటి ఆ శ్రీరామచంద్రుడు మా కోరికలన్నింటినీ తీర్చుగాకా అని భావం. సీతారాముల దాంపత్యాన్ని కాస్త పచ్చిగా వర్ణించిన పద్యాలు చాలా తక్కువ. అందులో ఒకటి "వాల్మీకి చరిత్రము" లోని ఈ శ్రీకార పద్యం. నిజానికి అది ఆ కాలంనాటి భోగలాలసతను సీతారాముల పరంగా వర్ణించాడని మనం భావించవచ్చు.

## 4. శ్రీ సీతా రామాంజనేయుల స్తుతి :

శా. **"శ్రీ మద్దివ్యనిజాం ఘ్రిపద్మములు సంసేవించుచున్ భ క్తి చే**
**ధీమంతుం డగునాంజనేయుని నసద్దేహేంద్రియాతీత చి**
**ద్భూమానందుఁడ వీవ నే నని కృప న్బోధించు శ్రీ జానకీ**
**రామబ్రహ్మము నంతరంగమున నారాధింతు నశ్రాంతమున్**." (శ్రీసీతారామాంజనేయ సంవాదం, పుట.1)

పై పద్యం పరశురామ పంతులు లింగమూర్తి గారు రచించిన "శ్రీ సీతారామాంజనేయ సంవాదము" లోనిది. ఒకానొక సందర్భంలో యయాతిని రక్షిస్తానని ఆంజనేయుడు మాట ఇవ్వడం, అతన్ని సంహరిస్తానని రాముడు ప్రతినభూనడంతో శ్రీరామునికి, ఆంజనేయునికి యుద్ధం వాటిల్లిన సందర్భంలో రాసిన కావ్యం ఇది. ఈ శ్రీకార పద్యంలో శ్రీరాముని స్తుతితో పాటు ఆంజనేయున్ని కూడా స్తుతించడం విశేషం. ఎల్లప్పుడూ శుభకరమైన, దివ్యమైన శ్రీరాముని పాదపద్మములను భక్తితో సేవిస్తున్న బుద్ధిమంతుడైన ఆంజనేయున్ని, ఇంద్రియాలకు అతీతమైన గొప్ప ఆనందాన్ని కృపతో ఇచ్చే ఆ జానకి రామబ్రహ్మమును ఎల్లప్పుడు మనసులో వేడుకుంటున్నాను అని అర్థం. జానకి మాత శ్రీరామునికి,ఆంజనేయునికి జరిగే యుద్ధాన్ని నివారించడానికి మిగుల ప్రయత్నం చేయడం చేత 'శ్రీ జానకి రామబ్రహ్మము'అని ప్రయోగించెను. చివరికి రామాంజనేయ సంవాదంలో రామ బాణం కంటే రామ నామమే గొప్పదని రుజువవుతుంది. ఆ రామ నామం వల్ల కలిగే ఆనందాన్ని శ్రీరాముడు హనుమంతునికి కటాక్షిస్తున్నానని ఈ పద్యంలో పరోక్షంగా చెప్పడం జరిగింది.

## 5. రాముని గుణగణాల వర్ణన:

సీ. **శ్రీ దేవతలకెల్ల - నాదిదేవుండవు /మూడు లోకములకు - ముఖ్యగురుఁడ**
**వవని జాతకు భర్త - వాద్యుండ వీవు స/ త్యవ్రతుండవు; శాంతి తత్పరుఁడవు**
**కోటిచంద్రులమించు మేటికాంతులు గల్గు/ ముఖమండలుండవుసఖుడవీవు!**
**కౌస్తుభమణి తోడ - గాంతియుక్తుండవు/సకలార్థ సిద్ధుల సహితుఁడీవు:**
గీ. **పరగ, సరయూ నదీతీర వాసుఁడగుచు**
**భక్తకోటిని రక్షించు పావనుఁడవు**

**అమల రఘువంశరాజుల నధికుఁడీవు**
**ప్రాంజలి, నొనర్తు రామ నీపాదములకు.** (శ్రీరామకర్ణామృతము, పుట.1)

పై శ్రీకార పద్యం కల్లూరి అహోబల రావు గారు రాసిన "శ్రీరామ కర్ణామృతము" ప్రథమశ్వాసంలోనిది. శ్రీరామప్రభవు ఎప్పుడూ కూడా తాను దైవాన్ని అని ప్రకటించుకోలేదు. కానీ ఎప్పుడూ ధర్మమార్గంలోనే పయనించాడు. కాబట్టి ఆయనకు దైవత్వాన్ని మనమే కల్పించుకున్నాము. సాక్షాత్తు ఆ నారాయణమూర్తి అవతారంగా భావించాము. అందుకే దేవతలోకెళ్ళి మొదటి దేవుడవు అని, కేవలం ఈ మానవలోకానికే కాదు, సకల చరాచర సృష్టికే కాదు, అన్ని లోకాలకి కూడా గురుత్వం వహించదగిన వ్యక్తివి అని, ఇక్కడ గురుత్వమంటే చెప్పదగినటువంటిది అని, తాను చేసినప్పుడు, పాటించగలిగినప్పుడే మరొకరికి చెప్పే అర్హత ఉంటుంది. ఇక్కడ రాముడు ధర్మ మార్గాన్ని పాటించాడు కాబట్టే అందరూ ఆ ధర్మమార్గాన్ని ఆచరించారు. అందుకే ఆ రాముడు ముల్లోకాలకు గురవు స్థానంలో ఉన్నాడు అని, ఆ సీతాదేవికి భూమాతకు భర్తవు అని, మొదటి వాడవు అని,ఎల్లప్పుడూ సత్యాన్నే పలికే వాడవు అని, రామాయణంలో రాముడు కోపించిన సందర్భాలు చాలా తక్కువ, కనుక ఆయన్ని ఆకృతి దాల్చిన శాంతి స్వరూపడవు అని, కోటి చంద్రుల కాంతితో సమానమైన గొప్ప ముఖ కాంతి కలిగిన వాడవు అని, విష్ణు అవతారంలో ధరించిన కౌస్తుభ మణిని రాముడు ధరించడం చేత అలాంటి మణికాంతితో దివ్యంగా వెలుగొందే వాడవు అని, (ఇక్కడ రాముడిని విష్ణు అవతారంగా స్తుతిస్తున్నాడు) అన్నింటినీ ఇవ్వగలిగే వాడివి అని, సరయు నది తీరంలో అయోధ్య పురంలో పుట్టి, పెరిగి, అక్కడే అవతారాన్ని చాలించినటువంటి వాడవు అని ,భక్త సమూహాన్ని పాపముల నుండి విముక్తి కలుగజేసే వాడివి అని, రఘువంశంలో పుట్టిన వారందరూ గొప్పవారని, రఘువంశంలోని వారు ఏనాడు ధర్మాన్ని వీడి ప్రవర్తించలేదని, అలాంటి నిర్మలమైన, మచ్చలేని రఘువంశ రాజులలో గొప్పవాడివి అని, ఇక్కడ రాముడు కాదు గొప్ప రఘువంశంలో పుట్టినందుకే రాముడు గొప్పవాడైనాడని కవి ఉద్దేశం. అలాంటి రాముని పాదాలకు నమస్కారం చేస్తున్నానని అర్థం.

శ్రీ కార పద్యాలు సాధారణంగా వృత్త పద్యాలలో ఉంటాయి. కానీ ఇక్కడ సీస పద్యంలో శ్రీ కార పద్యాన్ని రాయడం విశేషం. ఈ శ్రీ కార పద్యంలో రాముని శుభలక్షణాలన్నీ చెప్పబడ్డాయి. శ్రీరాముని నామం చెవులకు వీనుల విందుగా, కడు రమ్యంగా, అమృతం తాగినట్లుగా ఉందని వివరించడం జరిగింది.

నిండైన రామభక్తితో రామాయణాన్ని సంక్షిప్తంగా, సరళంగా తెలుగువారికందించిన కవయిత్రి మొల్ల. ప్రబంధయుగానికి చెందిన తొలి తెలుగు కావ్యకవయిత్రిగా భావింపబడే మొల్ల "చెప్పుమనే రామచంద్రుడు…." అని తనతో రాముడే రామాయణం చెప్పించాడని తెలిపి భక్తితో రామాంకితంగా రాసిన రామాయణం శ్రీరాముని గుణవర్ణనతో ప్రారంభించింది.

**"శ్రీ మహిమాభిరాముడు వశిష్ట మహాముని పూజితుండు సు**
**త్రామ వధూ కళాభరణ రక్షకుడాశ్రిత పోషకుండు, దూ**
**ర్వామల సన్నిభాంగుడు, మహాగుణశాలి, దయాపరుండు శ్రీ**
**రాముడు బ్రోచు భక్తతతి రంజిలున్నట్లుగ నెల్లకాలమున్."**

ఇందులో తెలిపిన రాముని గుణాలన్నీ మానవులకు సర్వదా ఆచరణీయాలు, అనుసరణీయాలు. అందుకే రాముడు అందరికి ఆదర్శమయ్యాడు. కవులు ఇష్టదైవ స్తుతిలో ఆదర్శమూర్తియైన శ్రీరాముని గొప్ప లక్షణాలను తెలియజేయడం సాధారణంగా కనిపించినా వాటన్నింటినీ కథాక్రమ పద్ధతిలో చెప్పడం విశేషం.

## 6. సీతారామ లక్ష్మణుల రూప వర్ణన :

పాలవేకరి కదిరీపతి రచించిన "శుకసప్తతి" లో శ్రీకార పద్యంలోని రాముని స్తుతి ఈ విధంగా ఉంది.

**"శ్రీ కమలాక్షి యై మెలంగు సీత తటిద్రుచి నొంద లక్షణ**
**శ్రీకర బాహుదండమునఁ జేర్చుధనుర్లత యింద్ర చావశో**
**భాకృతిఁ దాల్ప మేరుశిఖ రాశ్రయనీరదలీల సింహపీ**
**ఠికమనీయుఁ డౌ జయప టిష్ఠుని శ్రీరఘురాము నెన్నెదన్."** (శుకసప్తతి, పుట.1)

సీతారామ లక్ష్మణుల రూపాన్ని మన ముందు చిత్రించినట్లుగా వర్ణించబడిన పద్యం ఇది.సాక్షాత్తు లక్ష్మీదేవి స్వరూపమైన ఆ సీతాదేవి మెరుపుతీగ లాగా , పక్కనే ఉన్న లక్ష్మణుని చేతిలో ఉన్న ధనస్సు, ఇంద్రుని యొక్క చాపం లాగా అంటే ఇంద్రధనస్సు లాగా, మేరు పర్వతం మీద నల్లని మేఘం నిలిచినట్లుగా ఎత్తైన సింహాసనం మీద ఉన్న, జయాన్ని కలిగించే ఆ శ్రీరామునిని నేను స్తుతిస్తున్నాను అని అర్థం. దీనిలో శ్రీరామున్ని మేఘం తోను, సీతాదేవిని మెరుపుతీగతోను, లక్ష్మణున్ని ఇంద్రచాపంతోనూ అంటే ఇంద్ర ధనస్సుతోను పోల్చడం జరిగింది. విశేషం ఏంటంటే సీతారాములను మేఘం,మెరుపుతో పోల్చడం విశేషం. మేఘం, మెరుపు రెండు విడదీయరాని అంశాలు. మేఘంతోనే మెరుపు ఉంటుంది. మెరుపుతోనే మేఘం ఉంటుంది. మిక్కిలి కాంతితో మెరిసిపోతున్న సీతమ్మను మెరుపుతీగ లాగా, ధనస్సు ధరించిన లక్ష్మణస్వామి చేతిలో ఉన్న ధనస్సు ఇంద్రధనస్సులాగా ఉండగా నల్లగా ఉన్న శ్రీరామచంద్రుడు మేఘం లాగా ఉన్నాడు ఎలాంటి మేఘం అంటే సింహాసనం మీద ఉన్న శ్రీరాములు కనుక, మేరు పర్వతం మీద ఉన్న మేఘంలాగా ఉన్నాడని అర్థం. రామున్ని మేఘంతో పోల్చడానికి కారణం నలుపు మాత్రమే కాదు, మేఘం ఈ లోకానికి సుభిక్షాన్ని అందించే విధంగా వర్షాన్ని ఇస్తుంది. శ్రీరామచంద్రుడు సుభిక్షాన్ని కలిగించే విధంగా కరుణా వర్షాన్ని ప్రసాదిస్తున్నాడు. కాంతిని ప్రసాదిస్తుంది సీతమ్మ తల్లి. ఆనందాన్ని కలిగించే విధంగా రక్షణ ఇస్తున్నాడు లక్ష్మణుడు. అలాంటి దృశ్యాన్ని కలిగించే విధంగా ఈ పద్య రచన జరిగింది. సీతారామ లక్ష్మణుల రూపురేఖల్ని ఒక చిత్తరువు రూపంలో ఆవిష్కరించినట్లుగా ఉన్న అద్భుతమైన పద్యం ఇది.

చేమకూర వెంకట కవి రచించిన "విజయ విలాసము"లోని శ్రీకార పద్యంలో శ్రీ రాముని స్తుతి ఈ విధంగా ఉంది.

**"శ్రీ లెల్లప్పుడొసంగ నీ సకల ధాత్రీ చక్రమున్ బాహుపీ**
**ఠీ లగ్నంబుగ జేయు దిగ్విజయ మీన్ డీకొన్న చందాన,**
**నే వేళన్ సీతయు లక్ష్మణుండుఁదను సేవింపంగ విల్ పూని,**
**చె ల్వొప్పీలన్ దగు రామమూర్తి రఘునాథాధీశ్వరుం బ్రోవుతన్"** (విజయవిలాసము, పు.సం.1 )

"**ఎప్పుడూ తన దగ్గరనే సీతా లక్ష్మణులు ఉండగా విల్లు ధరించి ఉన్నందువల్ల ఎల్లప్పుడు సంపదలను, భూమండల పరిపాలనమును, దిగ్విజయాలను ఇవ్వడానికి పూనుకున్నడన్నట్లు (వరదహస్తము కనబరుస్తూ) ఉన్న శ్రీరామమూర్తి రఘునాధ రాజును రక్షించుగాక**". (చేమకూర వెంకట కవి, విజయవిలాసము, తాపీ ధర్మారావు వ్యాఖ్య, పు.సం.1 )

ఈ పద్యంలో చేమకూర వెంకట కవి శ్రీరాముని కోదండరాముడిగా వర్ణించాడు. నిజానికి సాధారణంగా రాముని విగ్రహంలో రాముడు మధ్యలో ఉండి, కుడి ఎడమవైపులకు సీతా లక్ష్మణులు నిలిబడి ఉంటారు. రాముడు తన ఎడమ చేతిలో నిలువుగా పట్టుకున్న విల్లుతో ఉండి, కుడి అర చేతి వేళ్ళు కిందికి చూపుతూ ఉన్నాడని వర్ణించాడు.

చేమకూర వెంకట కవి యొక్క ఇష్ట దైవం సూర్యుడు.కాని "విజయ విలాసము" కావ్యాదిలో మాత్రం దేవతా ప్రార్థనలో కావ్య కృతి భర్త అయిన రఘునాథ రాజు యొక్క ఇష్టదైవమైన శ్రీరాముని ప్రార్థించాడు.అంటే కవులు తమ ఇష్ట దైవాన్ని కాకుండా కృతిభర్తల యొక్క ఇష్టదైవాన్ని కూడా స్తుతించే ఆచారం ఉన్నదనే విషయం ఈ పద్యం ద్వారా మనకు తెలుస్తుంది. పారిజాతాపహరణంలో కూడా ముక్కుతిమ్మన తన ఇష్ట దైవం ఈశ్వరుడైనప్పటికిని, కృష్ణదేవరాయల ఇష్టదైవం వెంకటస్వామిని స్తుతించాడు. "**సీత లక్ష్మీ అవతారం. కాబట్టి సంపదలనూ, లక్ష్మణుడు భూమిని మోసే ఆదిశేషు అవతారం కాబట్టి భూచక్రభరణమునూ, విల్లు విష్ణువు పంచాయుధములలోని శార్ఙమనే ధనస్సు కాబట్టి దిగ్విజయమునూ రాముడు ఇస్తాడని భావము**." (చేమకూర వెంకట కవి, విజయ విలాసము, తాపీ ధర్మారావు వ్యాఖ్య,పు.సం.3 )

నారాయణామాత్యుడు రచించిన "హంసవింశతి" లోని శ్రీకార పద్యం.

**"శ్రీ రామాంశజ యైనజానకి యుర స్సీమాంతరాత్యంతవి**
**స్తారప్రోజ్జ్వలహారనాయకమణీ సందర్శితంబౌ నిజా**
**కారం బారసి యన్యకాంత యను శంఖకం జెందు నం చెంచి త**
**న్నారీ రత్నము నంకపీఠి నిడు సీతాభర్త నర్ణ బ్రోవుతన్** (హంసవింశతి, పు.సం.1)

లక్ష్మీదేవి అంశయైన సీతాదేవి తన ఎదురుగా ఉన్న శ్రీరామ మూర్తి యొక్క వక్ష స్థలం పై నున్న మణిమాల మధ్యలోని మణిరత్నం యందు తన ప్రతిబింబమును చూసి,అది తన రూపమే అని గ్రహించక అన్యకాంత అని భ్రమించుతుందేమేనని, ఆ శ్రీరామచంద్రుడు నారీరత్నమైన సీతా దేవిని తన ఎడమ తొడపై కూర్చోబెట్టుకున్నాడు.

అలాంటి శ్రీరామున్ని సేవిస్తున్నాను అని అర్థం. సాధారణంగా రామునికి ఎడమ వైపున సీత , కుడివైపున లక్ష్మణుల యొక్క విగ్రహాలనే మనం ఎక్కువగా చూస్తుంటాము.కాని భద్రాచలం లాంటి కొన్ని చోట్ల సీతాదేవిని రాముడు తన ఎడమ అంకం పై కూర్చోబెట్టకోవడం మనకు కనిపిస్తుంది.

ఇక్కడ సీతా దేవిని తన ఎదురుగానో, కుడివైపు గానో కాకుండా ఎడమవైపున కూర్చోబెట్టకోవడం చేతి ,తన మెడలోని హారం సీతాదేవికి కన్పించే అవకాశం లేకుండా,రాముని మనసులో అన్యకాంత ఉందేమో అన్న భ్రమ సీతకు కలగకుండా రాముడు చేసాడట.ఇక్కడ సీతా రాముల విగ్రహాన్ని అత్యంత చమత్కారంగా కవి వర్ణించాడు.

## 7. సీతారాముల వివాహ వర్ణన :

రామరాజభూషణుడు తన "వసు చరిత్ర"లో సీతారాముల కళ్యాణ ఘట్టాన్ని అద్భుతంగా వర్ణించాడు.

**"శ్రీ భూపుత్రి వివాహవేళ నిజమంజీరాగ్రరత్నస్ఫలీ**
**లాభివ్యక్తి వరాంఘ్రిరేణుభవ కన్యాలీల యంచున్ మదిం**
**దా భావింప శుభక్రమా కలనచేఁ దద్రత్నముంగప్పు సీ**
**తాభామాపతి ప్రోవుతన్ దిరుమలేంద్ర శ్రీమహారాయనిన్"** (వసుచరిత్ర, పు.1 )

ఈ పద్యంలో సీతారాముల కళ్యాణ సందర్భంలో పెళ్లి పీటలపై కూర్చున్న సీత తన కాలి యొక్క అందెలలో ఉన్న రత్నములో తన ప్రతిబింబమును చూసి రాముని పాదము తగిలినంతనే అహల్య రాయిగా మారిన విధంగానే రాముని పాద స్పర్శ చేత ఈ మంజీరంలో ఉన్న రత్నము కూడా స్త్రీ రూపం పొందిందనదేమోనని భావించిందట. ఇది గమనించిన రాముడు సీతాదేవి యొక్క అనుమానాన్ని పోగొట్టడానికై సన్నెకల్లు తొక్కడం అనే ఒక సంప్రదాయంతో ఆ మంజీర రత్నాన్ని తన కాలివేలతో తొక్కి వేసినాడట. అలాంటి సీతాభామ పతి తిరుమల రాయలని రక్షించాలని భావం. ఇక్కడ కోపంలో ఉన్న సీతను 'సీతాభామ' అని ప్రయోగించాడు. వివాహ సాంప్రదాయంలోని సన్నెకల్లు దొక్కడం అనేది ఒక పద్దతి. రాముడు సీత అనుమానాన్ని నివారించడానికి ఈ సన్నెకల్లు దొక్కడం అనే నెపంతో ఆ మంజీర రత్నంను తోక్కినట్టుగా వర్ణించడం అద్భుతం. ఇప్పటికి కూడా ఈ సన్నెకల్లు దొక్కడం అనే సాంప్రదాయం మన వివాహ పద్ధతిలో కొనసాగుతుంది. ఇక్కడ స్త్రీ లో సహజంగానే, ప్రేమ చేత ఉత్పన్నమయ్యే ఈర్ష్య, అసూయాలను సీత పాత్ర ద్వారా అద్భుతంగా వ్యక్తీకరించాడు కవి.

అలాగే సారంగ తమ్మయ తన 'వైజయంతి విలాసము'లో సీతారాముల వివాహసమయ వర్ణనలో భక్తితో పాటు సామాజికత వెల్లడవుతుంది.

ఉ. **"శ్రీ వసుధాసుతాంఘ్రి వివరింప శిరీషదళో సమాన మీ**
**క్ష్మావరు కే ల్ని సర్గ గుణకర్కశ మశ్మము మెట్టఁ బల్కె నె**
**ట్లీవసుధామరుండనుచు నింతులు వల్కగనంటఁ గొంచులో**
**కావనుఁ డై న పెండ్లికొడు కస్మ దభీప్సితముల్ ఘటించుతన్."** (వైజయంతివిలాసము, పు.సం.1).

భూదేవి ముద్దులకూతురు ముగ్ధ సీతమ్మ, ఆమె చేయి శిరీష పుష్పము వలే మిక్కిలి సుకుమారమైంది. భూమిని పాలించే ధీరోదాత్తుడైన రాజు రాముడు అతని చేయి రాయి వలె కఠినమైంది. ఈ లోకంలో మన్మధునివంటి రామచంద్రుడు ఈమెను ఎలా చూసుకుంటాడో అని చెలికత్తెలు మాట్లాడుతుండగా విని నవ్వుతున్న శ్రీరాముడు మా కోరికలు నెరవేర్చాలని కవి భావన. ఇందులో సీతారాముల కళ్యాణ సమయములో జరిగిన విశేషాలను వివరించాడు. రాచరికపు వివాహ సంబంధాలలో దూరభారాలు ఎక్కువ. అందుకే పెళ్లి చేసే సమయంలో వరుని గురించి పూర్తిగా తెలియని వధువు సంబంధీకులు అత్తవారింట్లో ఆమెను ఎలా చూసుకుంటారో అనే భావంతో ఉండేవారు. ఇదే అంశాన్ని చెలికత్తెల మాటల రూపంలో వెల్లడించాడు కవి. ఇది సీతారాముల వివాహాంశంగా చెప్పినప్పటికీ రచనా కాలం నాటి సామాజిక విశేషాలను తెలియజేస్తుంది.

## 8. ముగింపు:

తెలుగు సాహిత్యచరిత్ర నిర్మాణానికి ప్రధాన ఆకారాలుగా నిలిచినవి కావ్యావతారికలు. విశేషించి అటువంటి అవతారికల్లోని శ్రీకారపద్యాలు కవి ప్రతిభాపాండిత్యాలతో పాటు వ్యక్తిగతభక్తిజీవిత విశేషాలను వెల్లడిస్తాయి. వాల్మీకి రామాయణం ఆధారంగా గోనబుద్ధారెడ్డి గారి రంగనాథ రామాయణం తెలుగువారికి మొదటిసారి రామకథను కావ్యంగా అందించింది.అనంతరం ఎందఱో కవులు రామాయణ కావ్యాలు రాసారు. ఇతర కావ్యాలు రాసిన కవులు కూడా నిండైన రామభక్తితో కావ్యాది పద్యాల్లో రామున్ని స్తుతించారు.

ఈ విధంగా కావ్యఅవతారిక సంప్రదాయంలో భాగంగా వచ్చిన ఇష్టదేవతాస్తుతి శ్రీకారపద్యాల్లో రాముని దివ్యమంగళాకారాన్ని, సీతారామకళ్యాణాన్ని, ఆదర్శదాంపత్యాన్ని, అవ్యక్తానురాగప్రణయాన్ని, సీతాలక్ష్మణుల సమేత శ్రీరాముడిని అత్యంతరమణీయంగా వర్ణించాయి. శ్రీకారం మంగళకరం, శుభకరం. సీతారాములు ఆదర్శ దంపతులు, ధర్మ మార్గంలో నడిచిన వారు. ఈ రెండు అంశాలను మేళవించి కవులు సీతారాముల గుణగణాలను, స్తుతిస్తూ రాసిన శ్రీకారపద్యాలు రామాయణం సార్వజనీనతను వెల్లడిస్తున్నాయని చెప్పవచ్చు.

## 9. ఉపయుక్తగ్రంథసూచి:

1. అహోబలరావు, కల్లూరి.(1980). శ్రీ రామ కర్ణామృతము.
2. కదిరీపతి, పాలవేకరి.(1935).శుకసప్తతి,వెంకట రమణ పబ్లికేషన్స్, హైదరాబాద్.
3. జి.ఎన్. రెడ్డి, (1979). తెలుగు నిఘంటువు తెలుగు –తెలుగు, ఆం.ప్ర.సా. అ.
4. తిమ్మన్న, పుష్పగిరి. సమీర కుమార విజయము.(1929). వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి.
5. ధర్మారావు, తాపీ.(1968). చేమకూర వెంకట కవివిజయ విలాసము, హృదయోల్లాస వ్యాఖ్య, విశిష్ట రచనలు, హైదరాబాద్.
6. నారాయణామాత్యుడు, అయ్యలరాజు, (1945). హంసవింశతి.
7. రఘునాథ భూపాలుడు. (1940). వాల్మీకి చరిత్రము,ఆంధ్రవిజ్ఞాన సమితి, విజయనగరము.

8. రాములు, బి. (2023) తెలుగు కవుల ఇష్ట దేవతా స్తుతి విశేషాలు. సహృదయ ప్రచురణలు, వరంగల్లు.
9. రామరాజభూషణుడు, (2013) వసు చరిత్ర. ఎమెస్కో ప్రచురణలు, హైదరాబాద్.
10. వెంకటేశ్వరరావు, పొత్తూరు. (2010). పారమార్థిక పదకోశం.
11. వేంకటరాయ శాస్త్రి, వేదము. (1911). విజయవిలాసము (వ్యాఖ్య), జ్యోతిష్మతి ముద్రాక్షరశాల.
12. సీతారామాచార్యులు, బహుజనపల్లి, (2017). శబ్దరత్నాకరం.


***


**గమనిక:** ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.

వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.